# వీరజాటి

సుమారు అయిదేళ్ల తర్వాత అటకలో నుంచి నెత్తిమోపు గంగమ్మను, రాకాసి ముఖాన్ని దించాడు కోటప్ప. గుడిసె గోడలపైన, లోపలివైపు అడ్డంగా వెదుర్లతో అమర్చిన అటక అది. ఆ అటకలో ముసుగులేసి భద్రపరచిన ఆ రెండే - ఒకప్పుడు అతనికి జీవనాధారంగా ఉండేవి. వాటిని ఇంటిముందర పెట్టుకుని ముసుగులు తీశాడు. మూడు మూర్ల పొడవున్న చెక్క మధ్యలో త్రిభుజాకారంగా అమర్చిన గంగమ్మ తల్లి చిద్విలాసంగా నవ్వుకుంటున్నట్లుంది. ఆ నవ్వు ... ఏం చేసినా నువ్వు తిరిగి నన్ను మోయాల్సిందే! వీరజాటీతో కొట్టుకోవాల్సిందే అన్నట్లు తోచింది కోటప్పకు.

ఒక అడుగు వెడల్పుతో రెండు మూర్ల అడ్డచెక్క పీఠంగా అమర్చిన ఆ నిర్మాణం చుట్టూ వెదురు బద్దలతో జానెడు వెడల్పున అల్లబడి ఉంది. దాని మధ్యలో గంగమ్మ తల, ఆ తలకు కిరీటం, కింద యోగ ముద్రలో ఒక హస్తం, ఆశీర్వదించే భంగిమలో మరో హస్తం, చుట్టూ గొడుగులు అమర్చబడి ఉన్నాయి. అవన్నీ మేలైన అల్యూమినియంతో చేసినవే. వాటిలో రెండు వెండి గొడుగులు కూడా ఉండేవి. వాటిని ఆ మధ్యనే డబ్బులు అవసరమై అమ్మేసుకున్నాడు. అవన్నీ దాదాపు పల్లెల్లో తమ కోర్కెలు నెరవేరిన భక్తులు చేయించినవే. మిగిలిన భాగమంతా సందు లేకుండా అమర్చిన రంగురంగుల గాజులు, మీరుదీసి కట్టిన ముడుపులు, గాజువప్పుల్తో గొలుసులాగా చేసిన దండలు ఎంతో ఆకర్షణీయంగా ఉంది గంగమ్మ.

ఆమె కళ్లు విశాలంగా ఉన్నాయి. ముక్కుకు పెద్ద ముక్కెర, నోట్లో నుంచీ కిందికి చాచిన నాలుక, దాని కిరువైపుల - పెదిమల పైగా వెలుపలకు వచ్చిన కోరలతో భయంకరంగా ఉంది గంగమ్మ. దాని పీఠం పైన కుంకుమతో బారెడు పొడవున్న వీరతాడు ఒకటి చుట్ట చుట్టుకుని నిద్రపోతున్న త్రాచులా ఉంది. అతను అన్యమనస్కంగా, దిగాలుగా, కోపంగా ఉన్నాడు. రాత్రంతా నిద్ర లేని కారణంగా నీరసంగా కూడా ఉన్నాడు. ఆ రాత్రంతా పొలంలో పొర్లాడి వచ్చాడు కోటప్ప. భూమి తల్లి అతన్ని అక్కున చేర్చుకుంది. సిరిసంపదలు, భూమీ పుత్రా శాశ్వతం కాదురా. నీ చేనే చూడు. నిన్నటివరకు నీది, ఈ రోజు నాయుడిది. రేపింకెవరిదో అన్నట్లు ఓదార్చింది. ఆ నేల మట్టిని వంటినిండా పూసుకున్నాడు. తనివితీరా పూసుకున్నాడు. అక్కడే ఆ రాత్రంతా గడిపి వచ్చాడు.

"ఈ రోజుతో నీకూ, నాకూ ఋణం తీరిపోయింది తల్లీ! అనుబంధం తెగిపోయింది తల్లీ!" అంటూ ఆ చేలుమధ్యలో నిలబడి బోరున ఏడ్చాడు. గుండె చెరువయ్యేలాగా ఏడ్చాడు. తనివితీరా ఏడ్చాడు. గుండెలోని బాధంతా దిగిపోయేంతవరకు ఏడ్చాడు.

అలా రాత్రంతా ఆ తల్లి ఒడిలోనే గడిపి కడసారి ఆ మట్టిని కళ్లకద్దుకున్నాడు. కళ్లనీళ్లతో అతని చేతిలోని మట్టి తడసిపోయింది. తిరిగి పొద్దు పుట్టేవేళకి విరక్తిగా గుడిసెకు చేరుకున్నాడు.

తూర్పున సూర్యుడు గుండ్రంగా, ఎర్రటి మట్టి గడ్డలా పుట్టుకొస్తున్నాడు. గంగమ్మ చిద్విలాసంగా చూస్తూనే ఉంది. గంగమ్మకు అంటుకున్న దుమ్ము దులిపి, తడి బట్టతో గంగమ్మను, గొడుగుల్ని శుభ్రంగా తుడిచాడు. ఇప్పట్లో దీని అవసరం రాదనుకున్నాడు కోటప్ప. ఆ గంగమ్మను నెత్తిన పెట్టుకుని, ఒక చంకలో డప్పు తగిలించుకుని డప్పు కొడుతూ పల్లెల్లో ఇల్లిల్లూ తిరిగి ధనం, ధాన్యం సేకరించేవాడు కోటప్ప. అందుకే అది నెత్తిమోపు గంగమ్మ అయింది.

నిజానికి ఆ గంగమ్మ పేరు రెడ్డెమ్మ. బాలరెడ్డెమ్మ. ఆ గంగమ్మ చరిత్రను తెలిపే పాటనే అతను ఎప్పుడూ పాడేవాడు. అది ఇప్పుడు గుర్తుందో, లేదో అనుకున్నాడు.

"గుంతనక్కల కోడీ గూసే రెడ్డెమ్మ తల్లీ! బాల రెడ్డెమ్మా తల్లీ! చెర్లోపల్లో కొలువు దీరే రెడ్డెమ్మ తల్లీ! బాల రెడ్డెమ్మ తల్లీ!"

ఆ పాట పూర్తిగా గుర్తుకు రావడానికి అతనికి చాలాసేపు పట్టింది.

డప్పు కొడుతూ, ఆ పాట పాడుతూ అడుగులు వేస్తుంటే నోళ్లు వెళ్లబెట్టుకుని చూసేవాళ్లు ప్రజలు.

రెడ్డెమ్మ అనబడే ఆ గంగమ్మ, చిత్తూరు జిల్లాలోని వాయల్పాడుకు సమీపంలో ఉండే చెర్లోపల్లెలో వెలిసింది. ఆమె పన్నెండేళ్ళ ఓ కాపు కన్య! ఒకరోజు సాయంత్రం వేళ జొన్న చేన్లో మంచెపైన నిలబడి వడిసెలతో రాళ్లు విసురుతూ ఒంటరిగా గువ్వల్ని తోలుతోంది. ఆ సమయంలో దారెంట గుర్రాల పైన పోతున్న ఏడుమంది నవాబు సైనికులు ఆమెను చూశారు. ఇంకేముంది? గుర్రాలు దిగివచ్చి ఆమెను బలాత్కరించబోయారు. ఎలాగో ఆ సమీపంలోనే ఎత్తుగా ఉన్న ఒక గుండు నెక్కి కూర్చుంది. అయినా వాళ్లు వదలలేదు. దాంతో తన శీలాన్ని రక్షించుకోవడంకోసం ఆ బాలరెడ్డెమ్మ - "ఓ గుంటిగంగా! నాలో గనక సత్యముంటే నన్ను నీలో కలుపుకో!" అందట. వెంటనే రాయి నిలువునా రెండొప్పులై బాలరెడ్డెమ్మ అందులో దూకేసి అంతర్ధానమైపోయిందట. ఆ తర్వాత ఆ ఏడుమంది సైనికులు వాంతీ బేదీ తగిలి, రక్తం కక్కుకుని అక్కడికక్కడే చనిపోయారట. ఆ తర్వాత ఆ దారంటపోయే ఓ హరిజన యువకుడికి ఆ రెడ్డెమ్మ - గంగమ్మ రూపంలో ప్రత్యక్షమై, అంతా వివరించి సంతానం లేని వాళ్లకు సంతు నిచ్చే దేవతగా, కోరిన కోర్కెలు తీర్చే బాలరెడ్డెమ్మగా వెలసి ఉన్నాను అందట. ఇంకా "సంతు లేని నీకు సంతు నిస్తున్నాను. ఆ బిడ్డకు నా పేరు పెట్టుకో! నన్ను నెత్తిన పెట్టుకుని ఊరూర తిరిగి నా చరిత్ర గానం చేస్తూ బతుకు! నీకు మేలు చేకూరుతుంది!" అని చెప్పి మాయమైందట.

ఇక అప్పట్నుంచీ ఆ వ్యక్తి అలాగే చేశాడు. అతని తర్వాత అతని వంశీకులంతా అలాగే ఆ గంగమ్మను నెత్తిన మోస్తూ, బతుకుతూ వస్తున్నారట.

అలా కోటప్పకు వంశానుగతంగా వచ్చిన ఆస్తి గంగమ్మ.

◆ ◆ ◆ ◆

కోటప్ప పుట్టినప్పటి నుంచీ పిత్రార్జితంగా వచ్చిన గంగమ్మను మోస్తూ ప్రదర్శినలిస్తూ ఎంతో కష్టపడ్డాడు. కానీ ప్రతి సంవత్సరం విడవకుండా వస్తున్న కరువుల వల్లా, ప్రజల్లో నాగరికత ముదరడం వల్లా గంగమ్మ పట్ల భక్తి, ఆదరణ కొరవడిపోయింది. దాంతో ఇక సంసారం గడవటం కష్టంగా తోచిందతనికి. ఎలాగో కాళ్లూ, కడుపూ కూడదీసుకుని అడవి మొగదల రెండెకరాల స్థలాన్ని ఆక్రమించుకుని కంప కొట్టి, చదును చేసి పొలం తయారుచేసుకున్నాడు. అందులో ప్రతి ఏడూ వర్షాధారం వల్ల పండే వేరుశెనగ, సజ్జ, ఉలవలు వంటి పంటలు వేసి సంసారాన్ని నెట్టుకొస్తున్నాడు. వ్యవసాయం చేయడం మొదట కష్టమనిపించినా తర్వాత్తర్వాత అదే అలవాటైపోయింది. ఇంటిల్లపాదీ కష్టపడి పనిచేసేవాళ్లు. ఆ భూమిని, తమ శ్రమతో పండిన పంటల్ని చూసుకుని మురిసిపోయేవాళ్ళు వాటిని అపురూపంగా భావించేవాళ్ళు. దాన్ని మంచి ఆయకట్టు నేలగా తయారుచేసుకున్నాడు కోటప్ప. అతను అలా మొదట అక్కడ అడవిని కొట్టి, పొలం తయారుచేసుకున్న సంవత్సరానికి ఆ ఊరి సర్పంచ్ వీరమనాయుడు, ఆ పక్కనే అడవిని కొట్టించి సుమారు ఇరవై ఎకరాల ఆయకట్టు భూమిని తయారుచేసుకుని, పట్టా కూడా తెప్పించుకున్నాడు. దాని మధ్యలో ఒక దిగుడు బావిని కూడా తవ్వించుకున్నాడు. అందులో బాగా ఊట పడి, ఆ ఇరవై ఎకరాలు సస్యశ్యామలంగా మారింది

కోటప్ప కూడా తన రెండెకరాల పొలంలో ఎలాగోలాగు, ఎప్పటికైనా సరే ఒక బావి తవ్వించుకోవాలనీ, ఆ మెట్టను మడిగా మార్చాలనీ కలలు కనేవాడు. ముందు పొలం పట్టా కావాలి కదా! అందుకని మండలాఫీసు చుట్టూ తిరుగుతూనే ఉన్నాడు. కోటప్పకు పెళ్లయిన ఒక కూతురితోపాటు, పెళ్లి కెదిగిన ఒక కూతురు కూడా ఉంది. పన్నెండేళ్ల కొడుకూ ఉన్నాడు. ఆ ఊరికి ఫర్లాంగు దూరంలో ఉన్న హరిజనవాడలో చివరి గుడిసె అతనిదే.

⋄ ⋄ ⋄ ⋄

ఆ గుడిసె ముందర కూర్చొని గంగమ్మను సిద్ధం చేసుకున్నాడు కోటప్ప. అంతలోపల కొడుకు రెడ్డెప్ప రాకాసి ముఖాన్ని తుడిచి, అన్నీ సిద్ధం చేశాడు. ఒక రంగు చీర గుడ్డను చుట్టూ చుట్టి గంగమ్మను అలంకరించాడు కోటప్ప. భక్తులు కోరితే ఇవ్వడానికి కాస్తంత కుంకుమ పాదపీఠంపైన పెట్టుకున్నాడు. ఆ తర్వాత కూతుర్ని అడిగి ఓ పాత లంగా తెప్పించుకుని నడుముకు చుట్టుకున్నాడు. దానిపైన పాత చీర పీలికల్ని కిందికి వేలాడేటట్టుగా చుట్టుకుని, పైన ఓ పాత పైట దట్టీకట్టి బిగించాడు. మరో పాత పైటను మెడకు చుట్టుకున్నాడు. అతని మెడలోను, ఒక చేతి రెట్టకు తాయెత్తులున్నాయి. మరో చేతిరెట్టకు రాగితో చేసిన కడియం తొడుక్కున్నాడు. ముంజేతికి ఒక సత్తు కడియం వేసుకున్నాడు. నొసట కుంకుమతో ఒక పెద్ద బొట్టు పెట్టుకున్నాడు. బట్టతల, బుర్రమీసాలు. కాయకష్టంతో, గరిడీ దేలిన నల్లటి శరీరం - ఇదీ అతని ఆకారం!

చివర "ఒరే రెడ్డిగా! రాకాసి ముఖం జోలెలో పెట్టుకోని బయల్దేర్రా!" అన్నాడు.

"ఆఁ, అన్నీ సిద్ధమే నాయనా!" అన్నాడు రెడ్డెప్ప.

ఇంట్లోకి వెళ్లి, ఓమూల గోడకి తగిలించి ఉన్న డప్పును, గజ్జల గుత్తిని, చేతిలోకి తీసుకున్నాడు. వెలుపలికి వచ్చి కాళ్లకు గజ్జెలు కట్టుకున్నాడు. డప్పును తగిలించుకుని చిటికెన జిల్లల్ని చేత బట్టుకున్నాడు. ఆ తర్వాత వీరజాటీ భుజాన వేసుకున్నాడు.

"ఏంరా రెడ్డిగా, కడుపు కేమైనా తాగినావా?" ప్రశ్నించాడు కోటప్ప.

"రెండు గలాసులు సద్ది నీళ్లు దాగినా! నువ్వే తాగలేదు, నాయనా! రేతిరి కూడా ఏమీ తిన్నిట్టు లేవు!" అన్నాడు రెడ్డెప్ప.

ఆ ముందు రోజు జరిగిన సంఘటనతో అతని మనసు వికలమైపోయి ఉంది. అందుకే - "ఆకలిగా లేదు, ఇంక రారా!" అంటూ ఒక లుంగీని చుట్టలా చుట్టి నెత్తిన పెట్టుకుని వచ్చి గంగమ్మ ముందర గొంతు క్కూర్చున్నాడు. తన బలమంతా ఉపయోగించి మెల్లగా గంగమ్మనెత్తి నెత్తిన పెట్టుకున్నాడు. అదేమంత బరువు లేదు గానీ, నిలువుకు ఎత్తుగా ఉండడంతో నెత్తిన నిలబెట్టుకోవడం కొంచెం కష్టమే. అలవాటైన పనే గనుక సునాయాసంగా నెత్తిన పెట్టుకుని దారితీశాడు కోటప్ప. అతన్ననుసరించాడు రెడ్డెప్ప. ఆ మట్టిదారిలో అతను నడుస్తుంటే, కాళ్ల కింద పడ్డ ఇసుక పక్కలకు పితికివస్తూ పాదముద్రలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అతని నడక సింహపు నడకలా ఎంతో గంభీరంగా ఉంది. అయినా అతని మనసు నిండా కసి, ద్వేషం, పగ ...

అన్యమనస్కంగానే ఆ రోజంతా ఆ చుట్టుపక్కల ఊళ్లన్నీ తిరిగాడు. కాస్తంత ధాన్యం, కొన్ని కాసులు సేకరించాడు. ఇంటికి తిరిగి వస్తూ వస్తూ ఆ ఊళ్లో అడుగుపెట్టాడు. తనుంటున్న హరిజనవాడకు పోవాలంటే తప్పకుండా ఆ పల్లెలో దూరి రావాల్సిందే. అయినా ఆ ఊళ్లో ఆగకూడదనుకున్నాడు. ప్రజల కోరికపైన ఆగక తప్పలేదతనికి.

"ఏమయ్యా! గంగమ్మాయనా! నీ అడుగూ, ఆటా చూసి శానా దినాలైంది. వొగసారి అడుగేసి ఆడయ్యా! గంగమ్మకూ పూజలందుతాయి" అన్నారు ఆ సమయంలో వీధిలో ఉన్న ప్రజలు.

అందరూ తెలిసినవాళ్లే, కాదనలేకపోయాడు. నడివీధిలో గంగమ్మను దించి 'కణేల్ కణేల్' మంటూ డప్పు కొట్టాడు. ఆ శబ్దం విని ఊరి చివర రాములవారి గుడి మీద వాలి ఉన్న పావురాలు, కాకులు అరుచుకుంటూ వెళ్లిపోయాయి. సరిగ్గా అప్పుడే స్కూల్లో లాంగ్ బెల్ గణగణ మోగింది. అంతే! ఉన్నట్టుండి పిల్లలు పలకా, పుస్తకాలు చేతబట్టుకుని కేరింతలు కొడుతూ వీధిలోకి వచ్చేశారు. కోటప్ప భుజాన ఉన్న వీరజాటీ గంగమ్మ ముందర పెట్టి అక్కడే నిలబడ్డాడు. ఊళ్లో వున్న ఒకరిద్దరు రెడ్డెమ్మ భక్తులు వచ్చి గంగమ్మకు మొక్కుకుని, కోటప్ప నడిగి కుంకుమ తీసుకుపోయారు. కోటప్ప వేగంగా డప్పు కొట్టసాగాడు. రెడ్డప్పా ఆ పక్కనే నిలబడ్డాడు. పిల్లా జల్లా అందరూ తమ తమ ఇళ్ల ముందుకు వచ్చి కూర్చున్నారు. మగవాళ్లు కొందరు తమ ఇళ్ల

ముందున్న బండలపైన కూర్చుని చూడసాగారు.

"ఎన్నేండ్లయిందబ్బా నెత్తిమోపు గంగమ్మను చూసి!"

"ఇన్ని రోజులూ రానోడు మళ్లా ఈ దినం వచ్చినాడేమబ్బా?"

"ఎంతైనా వోళ్ల కులవృత్తి గదా! వదులు కుండేదాని కవుతుందా?

"ఎన్ని దినాలయిందో కోటప్ప అడుగు చూసి". "ఎందర్నో చూసినాం గానీ, కోటప్ప యేసినట్టు అడుగు ఎవ్వరూ ఎయ్యర్రా!"

"వీరజాటీతో అతను కొట్టుకున్నిట్టు ఎవరూ కొట్టుకోరు గూడా!"

ఇలా తలా ఓ రకంగా మాట్లాడుకోసాగారు. డప్పు శబ్దాన్ని కనుగుణంగా కాలి గజ్జల్ని కదిలిస్తూ అడుగు వేయసాగాడు కోటప్ప. గజ్జల శబ్దం ఘల్లు ఘల్లుఘల్లుమంటూ లయబద్ధంగా వినిపిస్తూ డప్పు శబ్దంలో విలీనమైపోతోంది. ఆ శబ్దం విని వీధి చివర రెండంతస్తుల మేడ వసారాలోకి వచ్చి నిలబడ్డాడు వీరమనాయుడు.

"నాతో పెట్టుకుంటాడా కొడుకు. మళ్ళా వోడి నెత్తికి గంగమ్మ వచ్చేట్టుగా జేసినా! నా ప్రతిజ్ఞ నెరవేరింది!" అనుకుంటూ మీసం మెలేస్తూ చూడసాగాడు.

సరిగ్గా అప్పుడే అతన్ని చూశాడు కోటప్ప. అతన్ని చూడగానే అతనిలో పగ, ద్వేషం, కసి ఒక్కసారిగా పెల్లుబికాయి. అతను చేసిన మోసం, దగా గుర్తుకొచ్చి ఊగిపోయాడు. ఆవేశంతో గంతులేశాడు. ఇంకా వేగంగా డప్పుకొడుతూ "అయ్! అప్పలప్పల! అప్పలప్పల!" అంటూ ఎగిరి నర్తించసాగాడు.

◆ ◆ ◆ ◆

చెట్టు చేమ కొట్టిన నేలను చదును చేయడానికి అయిదు వందలు అప్పు కావాల్సివచ్చింది కోటప్పకు. తనుంటున్న హరిజనవాడలో అయిదు వందలుంచుకునే ఆసామీనే లేడు. ఈ స్థితిలో తనకు సాయం చేయగలిగేది నాయుడొక్కడే అనుకున్నాడు అనుకున్నదే తడవుగా వీరమనాయుడింటికి వెళ్లి అయిదొందలు అడిగాడు.

"ఇస్తా గానీ యేది ఆధారం!" అన్నాడు నాయుడు.

"రాసుకో పత్రం!" అన్నాడు కోటప్ప.

"నువ్వే పత్రం రాయించి తీసుకురా!" అన్నాడు నాయుడు.

"నాకు అచ్చరం ముక్క రాదు సామే! నువ్వు ఎవురితోనైనా రాయించియ్యి. నే నేలిముద్దరేసేస్తా!" అన్నాడు కోటప్ప.

అదే అవకాశంగా తీసుకున్నాడు వీరమనాయుడు.

అమాయకులకు అధికవడ్డీకి డబ్బులిచ్చి, ఇచ్చిన దానికంటే రెట్టింపు పైకం ఇచ్చినట్లు పత్రం రాయించుకుని వారిని నిలువునా ముంచేయడం అతని నిత్య కృత్యం. అందునా ఆ

ఊరికంతా అతనే ధనవంతుడు. ఎవ్వరికి డబ్బులవసరమైనా అతనే ఇవ్వాలి. ఆ ఊళ్లో వేరేవాళ్లకు అంత స్తోమత లేదు. ఉన్నా, పేద జనాలకెవడిస్తాడు?

నూటికి నెలకు పది రూపాయల లెక్కన అయిదు వందలకు గాను వెయ్యి రూపాయలిచ్చినట్లు బాండుపత్రం రాయించి కోటప్ప దగ్గర వేలిముద్ర వేయించేసుకున్నాడు. చదువుకోనివాడు వింత పశువే కాదు, కళ్లున్నా చూడలేని గుడ్డివాడు కదా! అందుకే ఇన్ని రోజులకు తన బొటన వేలు ఉపయోగపడినందుకు తెగ ఆనందపడిపోయాడు కోటప్ప.

నేల చదును చేసిన తర్వాత నేల దున్నించడానికి, విత్తనాలు వేయడానికి మరికొంచెం అప్పు చేశాడు. ఆ తర్వాత కలుపుకనీ, కూలీలకనీ మరికొంత. ఇలా అప్పుడప్పుడూ అయిదో పదో అప్పు చేస్తూనే ఉన్నాడు కోటప్ప. అతను ఆ చేత్తో ఇస్తే, ఇతను ఈ చేత్తో తీసుకున్నాడు. తీసుకున్నదానికి రెట్టింపుగా బాండు రాయించి అతని దగ్గర వేలి ముద్రలు వేయించుకుంటూనే ఉన్నాడు వీరమనాయుడు.

కోటప్ప ఖర్చు పెట్టాడు. పొలంలో పంట పెట్టాడు. పంటలు సమృద్ధంగా రెండేండ్లు పండాయి. కోటప్ప దరిద్రం తీరిపోయింది. కానీ అతని అప్పు మాత్రం అలాగే మిగిలిపోయింది. అప్పటికీ ప్రతిఏడూ పండిన పొలంలో సగం అప్పుకింద ఇస్తూనే ఉన్నాడు కోటప్ప. ఈ నేపథ్యంలో కోటప్ప తన చిన్న కూతురికి పెళ్లి కూడా చేసేశాడు. ఇప్పుడు కోటప్పకు ఏ దిగుళ్లూ లేవు - ఒక్క అప్పు బాధ తప్ప. ఆ ఏడు వర్షాలు బాగానే పడ్డాయి.

కోటప్ప పొలం దున్నించి సగం వేరుశెనగ, సగం ఉలవలు పంట పెట్టాడు. వేరు సెనగ తీగలు పూతపట్టి పచ్చగా నిగారిస్తున్నాయి. ఉలవ తీగెలకూ కాయ దిగింది. ప్రతి ఉలవ చెట్టూ పచ్చని లేత కాయల్ని విరగకాసి ఉంది. శెనగచెట్లు ఊడలు దిగే కాలం.

"ఈ సమయంలోనే నేను జాగ్రత్తగా చూసుకోవాల. ముఖ్యంగా గొడ్డూ గోదా చేన్లో బడకుండా చూసుకోవాల" అనుకుంటూ ప్రతినిత్యం పొలం దగ్గరే ఎక్కువ కాలం గడిపేవాడు కోటప్ప.

ఉదయాన నిద్ర లేచి, తెల్లవారగానే పొలంకాడికి వెళ్లడం, అక్కడ కలుపు మొక్కల్ని పీకుతూనో, లేదా చేలల్లో ఉన్న రాళ్లను గట్టుపైకి చేరుస్తూనో మధ్యాహ్నం వరకు అక్కడే ఉండటం, ఆ తర్వాత ఇంటికొచ్చి భోజనం చేసి పడుకుని, తిరిగి సాయంత్రం మూడుకంతా పొలంకాడికి వెళ్లడం అతని దినచర్యలో ఒక భాగమైపోయింది.

ఇలా ఉండగా ఒక రోజు, పైటేళన్నం తిని కోటప్ప పొలంకాడికి బయలుదేరాడు. అక్కడి దృశ్యం చూసి హతాశుడైపోయాడు. పొలంలో ఓ పది పశువులుదాకా పడి ఆత్రంగా ఉలవ తీగెల్ని తినేస్తున్నాయి.

"వోరే! ఎవుడురా గొడ్లోడు! గొడ్లు సేన్లో బడినాయిరా కొడుకుల్లారా! ఎక్కడ సచ్చినార్రా!" అంటూ అశ్లీలంగా తిడుతూ పొలం దగ్గరకి పరుగెత్తాడు.

"మిమ్మల్నెత్తెయ్యనానీ! మీ గొడ్లను నక్కలకెయ్య! మీ ఆవుల్ని కోసి బండ కెయ్య! అన్నాయంగా పంట మేపేస్తే మీకు దూము దగల్దంట్రా!"

తిడుతూనే రాళ్లు విసురుతూ ఆవుల్ని అదిలించి తరిమేశాడు.

అవి వీరమనాయుడి పశువులు కోటప్ప పొలం పక్కనే ఉన్న వీరమనాయుడి బీడు పొలంలో ఆవుల్ని తోలి చెట్టు కిందపడుకుని అలాగే నిద్రపోయాడు అతని జీతగాడు ఆ నిద్రలో పక్క చేన్లో ఆవులు పడిన సంగతే తెలియలేదతనికి.

కోటప్ప అరుపులతో మేల్కొని - "ఓయ్యోవ్! గొడ్లు మావే! తప్పాయ్యి నీ ఉలవ సేన్లో పడినాయి గానీ తిట్టొద్దయ్యా! బాగలా!" అన్నాడు - 'నే నొక ధనవంతుడి జీతగాడిని కదా' నన్న గర్వం అతని మాటల్లో ధ్వనిస్తోంది అయినా కోటప్ప లెక్క చేయలేదు.

"ఎంత నష్టమైపోయరా సేను! కొంద్రి కొంద్రే మేసేసినాయి. మీ సేన్లల్లో అయితే ఈ మాదిరిగా తోలేస్తారంట్రా మీరు? సరే, పడితే పడినాయ్! ఇంకెప్పుడూ రానీయెద్దు! పో!" అన్నాడు ఆవేశంగా

అంతటితో ఆ సంఘటనను అతను పూర్తిగా మరిచిపోయాడు. కానీ అతని మాటలకు రంగులు పులిమి, ఉన్నదీ లేనిదీ కలిపి జీతగాడు వీరమనాయుడికి వార్త మోశాడు. ఆ మాటలకు నాయుడి గుండె భగ్గుమంది

"ఎంతటి వాడైనా తన వైపు కళ్లెత్తి చూడడానికే జడుసుకునే ఈ గ్రామంలో, నిన్న మొన్నటిదాంకా ఇల్లూ వాకిలీ లేని నెత్తిమోపు గంగమ్మగాడు అంత మాటనడమా?" అని పదేపదే ఆ మాటల్నే తలుచుకుంటూ గుండెను గాయం చేసుకున్నాడు.

"నన్ను తిట్టే మొగోడు ఈ గడ్డపైన ఇన్ని దినాలకు పుట్టినాడా? వోడికి దేన్ని చూసుకుని అంత ధైర్యం! ఆ రెండెకరాల చూసుకునే గదా! వాడి పొగురనిచేస్తాను. తల తిమురు తీసేస్తాను. వోడికి ఆ చేను లేకుండా జేసి, తిన తిండి లేకండా అలమటించేటట్లు చేస్తాను. ఆ గోసిపాతరాయుడిగాన్ని తిరిగి నెత్తిన గంగమ్మను పెట్టుకోని ఊరూరు తిరిగేటట్ల జేస్తాను. అట్ట చేయలేకపోతే నా పేరు దీసి వోడి పేరు పెట్టుకుంటాను. మా యమ్మకు నేను సొక్కంగ పుట్టనే లేదనుకుంటాను. అంతే! అంతేనంటే అంతే!"

తనకు తాను నిర్ణయం చేసుకున్నాడు. ప్రతిజ్ఞ చేసుకున్నాడు. ఆ ప్రతిజ్ఞ నెరవేరేంతవరకు కంటికి నిద్ర లేదు, సుఖం లేదు అనుకున్నాడు. కుందేలుకు లేచిందే పరుగన్నట్లు, అనుకున్న వెంటనే జీతగాన్ని పిలిపించాడు. అప్పటికప్పుడు తన అప్పును కక్కమని కబురంపాడు. తనను తిట్టినందుకు కోటప్పకు తగిన శాస్తి జరగబోతోందని తెగ సంతోషపడిపోతూ జీతగాడు వెళ్లి, 'ఇస్తావా చస్తావా' అన్నట్లు గొంతుమీద కూర్చున్నాడు.

ఆ సమయంలో కోటప్ప పరిస్థితి చాలా అధ్వాన్నంగా ఉంది. ఇంట్లో తిండి గింజలైపోయాయి. సంచార భిక్షకుడి స్థాయి నుంచీ సన్నకారు రైతు స్థితికి ఎదిగేకొద్దీ ఖర్చులు

కూడా అదే స్థితిలో పెరిగాయి. అప్పు లిచ్చేవాళ్లు ఎవరూ లేకపోయారు. అప్పటికీ తెలిసినవాళ్ల దగ్గరంతా అయిదో పదో అప్పులు చేసి సంసారం నెట్టుకొస్తున్నాడు. అలాంటి పరిస్థితిలో ఉన్నపళాన కట్టమంటే ఎక్కడి నుంచీ కడతాడు? అందుకే కొద్ది రోజులు ఆగమన్నాడు. ఈ సారి పంట చేతికి రాగానే మాసూళ్లో కట్టేస్తానన్నాడు. అయినా జీతగాడు ఒప్పుకోలేదు.

"అదంతా నాకు తెలవదు. డబ్బులన్నా ఇవ్వు, లేదా చెప్పుకునే దేమన్నా ఉంటే అయప్ప కొచ్చి చెప్పుకో!" అన్నాడు.

ఆ మాటతో ఇక గత్యంతరం లేక వీరమనాయుడు దగ్గరకు వెళ్లాడు కోటప్ప. మొత్తం ఎంతయిందో చెప్పమన్నాడు. మొత్తం అయిదు వేలన్నాడు నాయుడు. ఆ మాట వినేసరికి అతని గుండెలవిసిపోయాయి. తను తీసుకున్నదానికి వడ్డీతో సహా రెండు వేలకు మించదనుకున్నాడు. కానీ అది అయిదు వేలెలా అయిందో అతనికి అర్థం కాలేదు. ఆ మాటే అడగాలన్నా అతనికి ధైర్యంలేదు.

అయినా, "అంతెందుకయింది? ప్రతి సంవత్సరం మాసూల్లో సగానికి సగం ఇచ్చేస్తానే ఉండా గదా!" అన్నాడు ఎంతో వినయంగా.

"నువ్విచ్చింది వడ్డీలకే చాల్లేదు" అన్నాడు నాయుడు.

దాంతో తనపైన ఏదో కంటు పెట్టుకున్నాడని గ్రహించాడు కోటప్ప.

"ఇప్పట్లో నా వల్ల కాదు" అన్నాడు.

"అయితే నీ పంట ఫలం ఎట్టా ఎత్తకపోతావో నేనూ చూస్తా!" రెచ్చిపోతూ అన్నాడు నాయుడు.

"అయ్యా! అంత పని చేయొద్దు. బిడ్డలోన్ని సామే!" అంటూ కాళ్లావేళ్లా పడ్డాడు కోటప్ప.

అయినా నాయుడు ఒప్పుకోలేదు. పైగా, "నిన్నొదిలిపెట్టేదే లే" దన్నాడు. "ఎక్కువ మాట్లాడితే జీతగాళ్ల చేత తన్నిస్తా" నన్నాడు. చివరికి "నీ పొలం నీకు కాకుండా చేస్తా" నన్నాడు. ఇక చేసేది లేక మౌనంగా ఇంటి కొచ్చేశాడు కోటప్ప. ఆ వెంటనే జీతగాడిని పిలిపించి మండలాఫీసుకు పంపించి వి.డి.వోను, సర్వేయర్‌ను ఇంటికి పిలిపించుకున్నాడు నాయుడు.

"ఎంత డబ్బైనా సరే ఇస్తాను. నెల లోపల కోటప్ప రెండెకరాలు నా పేరుతో పట్టా అయిపోవాల. అంతే! మీరేం చేస్తారో నాకు తెలవదు" అన్నాడు.

"అది ఇంకా పోరంబోకే. పట్టా కాలా. సులభంగా పని అయిపోతుంది!" అని సర్వేయరు మాటిచ్చాడు.

దానికి తగిన డబ్బు జేబులోనుంచి తీసిచ్చాడు నాయుడు. ఒకేసారి అంత పెద్ద మొత్తం ముట్టేసరికి సంబరపడిపోయాడు సర్వేయరు. "నెల లోపల పట్టా చేయించి పత్రాలు మా వి.డి.వో. చేత పంపిస్తాను" అని భరోసా ఇచ్చి, వి.డి.వో.ను వెంటబెట్టుకుని అక్కడి నుంచి వచ్చేశాడు సర్వేయరు.

* * * *

మిద్దెపైనున్న వీరమనాయుడు చిద్విలాసంగా నవ్వుకుంటూనే ఉన్నాడు. కోటప్పను చూసి కోర మీసం నలుపుకుంటూనే ఉన్నాడు.

'ఆ నవ్వేనా కొంప ముంచింది ఆ కోర మీసమే నాలాంటి ఎందరో పేదల బతుకుల్లో నిప్పులు పోసింది' అనుకున్నాడు కోటప్ప.

ఆ తర్వాత చెక్కతో చేసిన రాకాసి ముఖాన్ని ముఖానికి వేసుకున్నాడు. దానికి చూడటానికి కళ్లదగ్గర, గాలి పీల్చుకోవడానికి ముక్కు దగ్గర రెండేసి రంధ్రాలున్నాయి. మూరెడు పొడవు, మూరెడు వెడల్పుతో ఆ మాస్క్ భయంకరంగా ఉంది. అందులో ఎర్రటి రంగులో తెల్లటి మిడిగుడ్లు, పెద్ద పెద్ద కోరల మధ్యన గడ్డం కిందికి వేలాడుతున్నట్లు పొడవైన నాలుక పెయింటింగ్ చేయబడి ఉన్నాయి ఆ రాక్షస ముఖాన్ని వేసుకున్న కోటప్ప ఆడుతూనే ఆ తలను వింతగా తిప్పుతూ అడుగులు వేయసాగాడు

అతనిలో పగ, ద్వేషం, కోపం ..

నాయుడు బాకీని కోటప్ప కట్టలేకపోయాడు. దాంతో అన్నంతపనీ చేశాడు నాయుడు. సరిగ్గా పొలం వడుపుకునే సమయంలో ఈ చేను నాదన్నాడు. ఈ పంటా నాదేనన్నాడు. 'నీ తాతకు చెప్పుకో పో! నీ వల్ల అయింది చేసుకో పో!' అన్నాడు.

ఇరవై మంది కూలీలను పెట్టించి రాత్రికి రాత్రే వేరుశెనగ చెట్లను పీకించేశాడు. ఉలవ తీగెలు కోయించేశాడు. ఒకే ఒక కొండ్ర తప్ప చేను మొత్తం మడకతో దున్నించి మరీ పీకించాడు. ట్రాక్టరు పెట్టించి తెల్లారేసరికంతా తీగెలన్నింటినీ తన ఇంటికి తోలించేశాడు. ఆ తెల్లవారి మిగిలిపోయిన కొండ్రలో నాయుడి జీతగాళ్లు చెనిగ తీగెల్ని పీకి పీకి కుప్పగా వేస్తున్నారు. గెనింపై నున్న ఒక రాతిపైన నాయుడు మీసం మెలేస్తూ కూర్చోనున్నాడు.

ఆ రోజు యధాప్రకారంగా పొలానికి బయలుదేరాడు కోటప్ప. దూరం నుంచీ - నిన్నటిదాకా బాగుండి తెల్లారే వేళకి ఎవరో మంత్రించినట్లు బీడైపోయిన పొలాన్ని చూసి అవాక్కైపోయాడు. పరుగెత్తుకుంటూ దగ్గరి కెళ్లాడు.

"ఏందయ్యా ఇదీ?" అన్నాడు నాయుడితో

"ఈ దినం నుంచీ ఈ చేను నీది కాదు పోరా!" అన్నాడు నాయుడు.

"నా చేనుపంట దోచుకోని, నా చేనూ లాక్కోని నా కన్నాయం సేయెద్దు సామీ!" అని కాళ్లా వేళ్లా పడ్డాడు కోటప్ప.

"ఈ చేనూ నాదే, ఇందులో పంటా నాదే! అసలు ఈ చేను నీ దనడానికి రుజువేందిరా? నీ దిక్కున్న, చోట చెప్పుకో, పో! రేపట్నుంచీ చేన్లో అడుగు పెట్నావంటే కాళ్లూ చేతులూ ఇరగొట్టిస్తా! ఎక్కువ మాట్లాడితే నీ తలే తీయించేస్తా! పో!" అన్నాడు నాయుడు.

కోటప్ప బావురుమన్నాడు. అతని పరిస్థితిని చూసి జీతగాళ్లు నవ్వుకున్నారు. కోటప్పచేత తిట్లు తిన్న జీతగాడయితే అతన్ని ఎగతాళిగా చూశాడు. దాంతో ఆవేశం రెచ్చిపోతూ, అశ్లీలంగా తిడుతూ జీతగాళ్ల మీద పడ్డాడు కోటప్ప

"వొరే! గెనిము దాటేంతవరకు కాళ్ల గెనిపులు ఇరగగొట్టండ్రా నా కొడుక్కి! మళ్లా మళ్లా చేన్లోకి రాకుండా చేసెయ్యండ్రా!" ఆవేశంగా పైకి లేచి అన్నాడు వీరమనాయుడు.

వాళ్లు అలాగే చేశారు. అతన్ని కొట్టి చేని కవతలకి తరిమేశారు. కోటప్పకు దిక్కుతోచలేదు. ఒకప్పుడు ఆ పొలం చూసుకుని అనంత విశ్వం అంచుల వరకూ తనకు స్వేచ్ఛ ఉందనుకున్నాడు కోటప్ప. ఆ పొలం చూసుకునే నీచమైన భిక్షుకవృత్తి నుంచీ గౌరవంగా, తలెత్తుకుని గర్వంగా తిరగగలననుకున్నాడు. కానీ ఇప్పుడు ఆ అనంత విశ్వపు అంచులు తను నిలబడ్డ కాళ్ల కింద నేలలోకి కుంచించుకుపోయినట్టు అనిపించింది. తనకు ఇక ఏ దిక్కూ లేదనిపించింది.

"వొరే! చెట్లు బాగా తవ్వండ్రా! ఒక్క చెనిక్కాయ కూడా నేల్లో పోగూడదు. చిన్న బుడతకాయంత కూడా తప్పోకుండా తవ్వండి. కుళ్లబొడిచి తవ్వండి!" అని తన కసినంతా తన మాటల్లో ధ్వనింపచేస్తూ అన్నాడు నాయుడు.

ఆ మాటలు కోటప్ప గుండెకు శూలాల్లా తాకుతూనే ఉన్నాయి.

నిరాశ, అవమానం నిండిన గుండెతో ఇంటికి చేరుకున్నాడు. ఇంట్లో అడుగు పెట్టగానే 'ఏమయ్యా! ఇంట్లో బియ్యమైపోయినాయి. పదిరోజుల్నుంచీ సెప్తానే ఉండా. నీ మొఖుసుకెక్కలా. అడుగూ బొడుగూ ఊడ్చి ఈపూట ఎట్టోవొగట్ట గడపతా! ఆపైన నావల్ల గాదు సంసార మేగేదానికి" అని నిష్ఠూరంగా అన్న భార్య మాటలు అతన్ని ఇంకా బాధించాయి.

"గంగమ్మ నెత్తుకోని ఇల్లిల్లూ తిరగతా ఉన్నప్పుడే బాగుండె. తిన్నా తినకపోయినా ఏ బాధా లేకుండా ఉండె. యెట్లోవొగట్ల రెండెకరాల సేను సంపాదిస్తి. అప్పట్నుంచీ ఇంక గెడివు తీరికలా. మొఖుసుకింత శాంతిలా. ప్రాణానికి పెద్ద యాతనైపోయింది. ఈ గడ్డపైన నాలాంటోడు కాసింత మడిచెక్కో, కాసింత సేను గుడ్డమో పెట్టుకోని బతికేదానికేలా ... యెల్లకాలమూ ఈ మాదిరిగా దేశం పైన తిరగతా ఉండాల్సిందేనా? వొగరు పోసేదానికి సెయొగ్గి, తిక్కలోళ్ళ మాదిర్తో బతకాల్సిందేనా? ఇట్టా ఎంత కాలం? మాలాంటోళ్ల బతుకులు మారవా?"

పరిపరి విధాల ఆలోచించాడు. ఆ రాత్రంతా ఆలోచించాడు. ఎంత ఆలోచించినా అతని ప్రశ్నలకు జవాబే కనిపించకుండా పోయింది.

◆ ◆ ◆ ◆

అడుగులు వేస్తూనే నాయుడి ఇంటివైపు చూశాడు కోటప్ప.

పైఅంతస్తులోని నాయుడు నోరంతా తెరచి అట్టహాసంగా నవ్వుతూన్నట్లనిపించిందతనికి.

అతనిలో పగ, ద్వేషం, కోపం ...

ఆ పగ ఎవరిపైన? మోసపోయిన తనపైనా? తోటి మనిషికి అన్యాయం జరుగుతున్నా స్పందించని సమాజంపైనా? అనాదిగా తనలాంటివారిని దగా చేస్తూ వస్తూన్న ధనిక భూస్వామ్యంపైనా? ఎవరిపైన? ఏమో! అతనికే తెలియడంలేదు. ఆవేళ అతనిలో ఆవేశం కట్టలు తెంచుకుంది. అంతే! డప్పు కొట్టడం ఆపేసి, దాన్ని తీసి రెడ్డప్ప చేతికిచ్చాడు.

మాస్క్ తీసి పక్కన పెట్టాడు. కణేల్ కణేల్ మని రెడ్డెప్ప డప్పు కొట్టడం ప్రారంభించాడు.

అతనిలో ఆవేశం, ద్వేషం, పగ ...

కోపంతో అతని కళ్లు ఎర్రబడ్డాయి ముఖం ఎర్రగా కందిపోయింది. శరీరమంతా ముచ్చెమటలు పోస్తూన్నాయి. పొద్దుట్నుంచీ కడుపుకి ఏమీ తినలేదు. పక్క ఊళ్లో ఓ తల్లి పట్టెడన్నం పెడితే మధ్యాహ్నం మెప్పుడో చెరికొంచెం తిన్నారు. ఆ కాసింత అతని ఆకల్ని పోగొట్టలేదు. అందుకే అతని శరీరం నీరసంగా, నిస్సత్తువుగా ఉంది. అయినా అతను ప్రదర్శన ఆపలేదు. ఎంత చూడకూడదనుకున్నా ఎదురుగా మిద్దెపైన వీరమనాయుడు నవ్వుతూ కనిపిస్తూనే ఉన్నాడు. కోటప్ప ఇక భరించలేకపోయాడు. వెంటనే వెళ్లి వీరజాటీని చేతిలోకి తీసుకున్నాడు. అందరూ ఆతృతగా చూస్తూన్నారు. గంగమ్మ చూస్తూనే వుంది. మిద్దెపైన నాయుడూ చూస్తూనే వున్నాడు నవ్వుతూ. రెడ్డెప్ప డప్పు కొట్టడం ఆపి, ఒక అడ్డవస్త్రం విదిలించి తెచ్చి గంగమ్మ ముందర పరచి, తిరిగి డప్పు కొట్టసాగాడు. కొడుతూనే మధ్యమధ్యన, "అయ్యలారా! అన్నలారా! అమ్మలారా! అక్కలారా! ధర్మము చేయండి మీకు తోచిందివ్వండి. ఒక్క పావలా, ఒక్క అర్ధరూపాయి. ఒక్క రూపాయి ధర్మము చేయండి. మీరు కట్టేసి వదిలేసిన ఓ పాత పంచె కానీ, ఒక చీర గానీ, రవిక గానీ, ఒక డాయరు గానీ, ఒక చొక్కాయి గానీ - మీకు తోచింది ధర్మం చేయండి!" అని కేకలేస్తూ ఆవేశంతో డప్పు కొడుతున్నాడు.

కోటప్ప వీరజాటి మొదలు పట్టుకుని ఒక్కసారి పైకెత్తి కొసను గాల్లోకి విసిరాడు.

ఒక పులి గాండ్రించినట్టు ... ఒక సింహం గర్జించినట్టు ... ఒక మేఘం ఉరిమినట్టు ... 'ఛళ్!' మని వీరజాటి శబ్దం చేసింది. ఆ శబ్దం ఆ పల్లె గుండెలో ప్రతిధ్వనించింది. మళ్లీ వీరజాటిని పైకెత్తాడు. మిద్దెపైన నాయుడు అలాగే చూస్తున్నాడు. కోటప్ప కళ్లు నిప్పులు చెరుగుతున్నాయి.

అతనిలో పగ ... ద్వేషం ... కసి ...

ఆ సమయంలో అలనాడు దక్షయజ్ఞం ధ్వంసం చేయడానికి బయలుదేరిన వీరభద్రుడిలా ఉన్నాడతను. ఈసారి మళ్లీ వీరజాటీని గాల్లోకి విసిరాడు. ఆ వీరజాటీ ఛళ్లుమని శబ్దం చేసుకుంటూ మెరుపు వేగంతో మెలి తిరిగి క్షణంలో అతని శరీరాన్ని చుట్టి వచ్చేసింది. మామూలుగా అయితే, శరీరానికి దెబ్బ తగలకుండా ఎంతసేపైనా కొట్టుకోగలడు కోటప్ప. అదొక నేర్పు! అది వాళ్లకి పుట్టుకతో వచ్చే విద్య! కానీ ఆవేళ కోటప్ప నిజంగానే తనకు తాను కొట్టుకోసాగాడు. ఆ దెబ్బలతో అతని శరీరంపైన ఎర్రటి చారలు ఏర్పడ్డాయి. అతను మళ్లీ మళ్లీ కొట్టుకుంటూనే

ఉన్నాడు. అడుగులు వేస్తూనే ఉన్నాడు. రెడ్డెప్ప తన శక్తినంతా ఉపయోగించి డప్పు కొడుతున్నాడు. గంగమ్మ చూస్తూనే వుంది. మిద్దెపైన నాయుడు చూస్తూనే వున్నాడు. కోటప్ప శివతాండవం చేస్తున్నాడు. వీరభద్రుడి చెర్నాకోలగా భావింపబడే ఆ వీరతాడుతో అలా కొట్టుకోవడం అతని ప్రదర్శనలో చివరి అంశం. ఆవేళ అతను పిచ్చివాడే అయ్యాడు. ఆవేశంతో రొప్పుతున్నాడు. నీరసం ముంచుకొస్తున్నా లెక్కచేయడంలేదు. అతని కాళ్ళ గజ్జలు ఘల్లు ఘల్లు ఘల్లు మని శబ్దం చేస్తూనే ఉన్నాయి. అతను అలా ఎగురుతూనే కొట్టుకోసాగాడు. కొట్టుకునే కొద్దీ అతనిలో ఆవేశం కట్టలు తెంచుకోసాగింది. అతని నరనరంలోనూ పగ ... ద్వేషం ... కోపం ... కసి! అది ఏమీ చేయలేని పేదవాడి పగ! అది అతని పెదవికే చేటు తెచ్చే సగటు పేదవాడి కోపం!

"అయిదేళ్లపాటు ఎంతో కష్టపడి తయారుచేసుకున్న చేను ... బిడ్డలకంటె ఎక్కువగా చూసుకున్న చేను. ప్రాణానికి ప్రాణంగా చూసుకున్న భూమి. తల్లి మాదిర్తో ఆకలి కింత బువ్వ పెట్టిన భూమి. ఈ దినం నాయుడిపాలైపాయ! తన రెక్కల కష్టం నాయుడిపాలవడానికి తనే కారణం. అతని దగ్గ రెందుకు అప్పు తీసుకోవాలి? తీసుకోని యెయ్యమన్న చోటల్లా బాండు పత్రాల్లో ఎందుకు వేలిముద్దర్లేసెయ్యాలి. అట్ల చేయడం తన తప్పే" అనుకున్నాడు కోటప్ప.

"దానికి ప్రాయశ్చిత్తం?"

తనకు తానే ప్రశ్నించుకున్నాడు. దానికి జవాబుగా మళ్లీ మళ్లీ జాటీతో కొట్టుకున్నాడు. ఆవేశంతో అడుగులు వేశాడు. వీధిలో వున్న గులకరాళ్లు కాళ్లకు తగిలి రక్తం ఓడుతున్నా అతను లెక్కచేయలేదు. శరీరమంతా వాతలు తేలి రక్తం కమ్ముకొస్తోంది. నాయుడు చూస్తూనే ఉన్నాడు.

ప్రజలు సంతోషంగా ఈలలు వేస్తున్నారు! "షెహభాష్!" అంటూ మెచ్చుకుంటున్నారు. కానుకలు కురిపిస్తున్నారు. గంగమ్మ చూస్తూనే ఉంది. నడి వీధిలో పరచిన ధర్మవస్త్రం మీద, చుట్టుపక్కల ఎక్కడంటే అక్కడ చిల్లర డబ్బులు ... ఆ వస్త్రం మీదనే ధాన్యం కుప్పలు చేరుతున్నాయి. పాత బట్టలు వచ్చి పడుతున్నాయి.

అదే సమయంలో అతని పొలాన్ని నాయుడుపేర పట్టా చేయించి ఆ కాగితాలు చేతపట్టుకుని అక్కడికి వచ్చాడు వి.డి.వో. అతని పరిస్థితిని చూశాడు.

'పొట్టేలి కొండను ఢీకొంటే ఏమవుతుంది? పెద్దోళ్లతో పెట్టుకుంటే అంతే!' అని హేళనగా మనసులోనే అనుకుంటూ నాయుడి ఇంటి వైపుకు వెళ్లిపోయాడు.

అతను కొట్టుకుంటూనే ఉన్నాడు. కొట్టుకుంటూనే నాయుడి వైపు చూశాడు. ఆ చూపుకి కాస్తంత ఉలిక్కిపడ్డాడు నాయుడు. క్రమంగా నీరసం, నిస్సత్తువ కోటప్ప శరీరాన్నాక్రమించుకోసాగాయి. మైకం ముంచుకురాసాగింది. కళ్లు బైర్లుకమ్మాయి.

చివరిసారిగా వీరజాటీని ఛెళ్ మనిపించి గట్టిగా కొట్టుకున్నాడు. ఆ శబ్దం అందరి గుండెల్లోనూ తిరిగి ప్రతిధ్వనించింది. మిద్దెపైనున్న నాయుడి గుండెలోను ప్రతిధ్వనించింది. దాంతో ఆ వీరజాటీనే తన గుండెకు తగిలినట్టనిపించింది నాయుడికి. సరిగ్గా అప్పుడే వి.డి.వో.

పట్టా కాగితాలు అతని చేతిలో పెట్టాడు.

కానుకలు కుప్పతెప్పలుగా పడుతున్నాయి. ప్రజలు హర్షధ్వానాలు చేస్తున్నారు. చివరికి కోటప్ప అందులోనూ ఓడిపోయాడు. నీరసం అతన్ని జయించింది అతను అలాగే నేలకు ఒరిగిపోయాడు డప్పు కొట్టడం ఆపి, "నాయనా!" అంటూ పరిగెత్తాడు రెడ్డెప్ప. ఈ హఠాత్సంఘటనకు ప్రజలకరతాళ ధ్వానాలు ఒక్కసారిగా ఆగిపోయాయి. ఏమైందో ననుకుంటూ అందరూ చూస్తూనే వున్నారు అతని దీనావస్థకు ప్రజలు నాయుడిని తిట్టిపోస్తున్నారు. రెడ్డెప్ప "నాయనా! నాయనా!" అంటూ అరుస్తూనే ఉన్నాడు. గంగమ్మ చూస్తూనే వుంది.

వీరమనాయుడు కోటప్పను చూస్తున్నాడు. విస్తుపోయిన వి.డి.వో నాయుడి ముఖంలోకి చూస్తున్నాడు నేలపైన కోటప్ప నీరసంగా మూలుగుతూ కదులుతున్నాడు. అతని ప్రక్కనే, అంతవరకూ కాటేసిన కాలసర్పంలా, కదలకుండా మెదలకుండా నేలపైన పడివున్న వీరజాటీ, రెడ్డప్పచేతుల్లో కొచ్చింది. గిరగిరాతిరిగింది ఛెళ్‌ఛెళ్‌మంటూ విజృంభించింది. మెరుపులా మెరిసింది. ఉరుములా ఉరిమింది.

**● 12-18, జూలై 1995, ఆంధ్రప్రభ వారపత్రిక ●**